నమస్తే తెలంగాణ
జనగామ
5 | మంగళవారం 12 మార్చి 2024 | JANAGAON

అంబాలలో పరకాల-హనుమకొండ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

కమలాపూర్, మార్చి 11 : మండలంలోని అంబాల గ్రామంలో పరకాల-హనుమకొండ రహదారిపై శ్రీరాములపల్లి, గూనిపర్తి, అంబాల గ్రామాల రైతులు సాగునీటి కోసం సోమవారం రోడ్డుపై బైఠాయించి వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఎస్సారెస్పీ అధికారులు డీబీఎం 24కు సరిపడా నీటిని విడుదల చేయకపోవడంతో హసన్‌పర్తి మండలం నాగారం వరకే వస్తుండడంతో అక్కడి రైతులు కాల్వకు అడ్డంగా కట్టలు కడుతున్నారన్నారు. దీంతో తమ గ్రామాలకు కాల్వ నీళ్లు రాక పంటలు ఎండుతున్నాయన్నారు. కాకతీయ కాల్వ నిండుగా వెళ్తున్నా అధికారులు పూర్తిస్థాయిలో గేట్లు లేపకపోవడంతో నీళ్లు కొద్దిగా వస్తున్నాయని, సగం దూరం వరకు కూడా రావడం లేదన్నారు. యాసంగిలో సాగు చేసిన వరి పొట్టదశకు వచ్చిందని, మక్కజొన్న పీసు వేస్తుండడంతో నీళ్లు అందక ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డీబీఎం 24కు నీళ్లు ఎక్కువగా విడుదల చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంతో రోడ్డుపై బైఠాయించినట్లు తెలిపారు. కాలువ నీళ్లు రాకపోతే 500 ఎకరాల్లో పంటలు ఎండిపోతాయన్నారు. పెట్టుబడులు పెట్టి చివరికి పంటలు ఎండితే అప్పుల్లో కూరుకుపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఎస్సారెస్పీ అధికారులు వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని తేల్చిచెప్పారు. దీంతో అక్కడికి వచ్చిన ఎస్సారెస్పీ ఏఈ రాకేశ్ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పాడు. నీళ్లు వెంటనే విడుదల చేయాలని రైతులు పట్టుబట్టడంతో ఏఈ తన పరిధిలో లేదని చేతులెత్తేశాడు. సీఐ హరికృష్ణ ఎస్సారెస్పీ ఎస్ఈ వద్దకు తీసుకెళ్తానని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

బల్దియా ప్రజాపాలన కౌంటర్ల వద్ద బారులు తీరిన ప్రజలు

ప్రజాపాలన కష్టాలు

కౌంటర్ల వద్ద జనం ఇబ్బందులు

అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్

వరంగల్, మార్చి 11 : గ్రేటర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పొప్పుల సవరణకు అరకొర కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా అధికారులు హనుమకొండ, వరంగల్‌లో 6 కేంద్రాల చొప్పున ఏర్పాటు చేశారు. అక్కడ సిబ్బంది కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. పలు కేంద్రాల వద్ద ఎండలో అవస్థలు పడుతున్నారు. తాగునీటి వసతి కల్పించకపోవడంతో ఆగమవుతున్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్దకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తుండడంతో ఇతర పౌరసేవల కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా బల్దియా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కాగా, ప్రజాపాలన సవరణలు, కొత్త దరఖాస్తుల స్వీకరణ కోసం అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బల్దియాలో కాకుండా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

- దేశంలో నంబర్‌వన్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌దే..
- అన్నీ ఫ్రీ అనగానే ప్రజలు కాంగ్రెస్ మాయలో పడ్డరు..
- గ్యారెంటీలు అమలు చేయకపోతే పోరాటమే..
- బీఆర్ఎస్ హయాంలో ఎక్కడ చూసినా నీళ్లే..
- కాంగ్రెస్ రాగానే మళ్లీ నీటి కష్టాలు మొదలు
- మీ ఇంటి ఆడబిడ్డను.. ఆశీర్వదించండి..
- పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభలో ఎంపీ మాలోత్ కవిత


పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభలో మాట్లాడుతున్న ఎంపీ కవిత

మహబూబాబాద్, మార్చి 11 : 14 ఏళ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని మహబూబాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అన్నీ ఫ్రీ అనగానే ప్రజలు వారి మాయలో పడ్డారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని, ప్రాజెక్టులో మూడు పిల్లర్లకు పగుళ్లు వస్తే మరమ్మతు చేయాల్సిందిపోయి కేసీఆర్ చుట్టూ రాజకీయం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసి ప్రజలు కష్టాలను కొని తెచ్చుకున్నారని అన్నారు. అపర భగీరథుడు కేసీఆర్ ఓడిపోగానే నీటి కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికే ఆదర్శంగా నిలిచేలా పాలన చేసిన కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి విషం చిమ్ముతున్నారని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలమైందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ఘనత బీఆర్ఎస్‌కు దక్కకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యంతో పిల్లర్లు కుంగితే.., నాణ్యతా లోపమని ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా సమస్యకు పరిష్కారాన్ని చూపి రైతులకు నీళ్లివ్వాల్సింది పోయి రచ్చ చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా నీళ్లు, పచ్చటి పంట పొలాలు కనిపించేవని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నీటి కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ ప్రజల తరపున పోరాడుతామన్నారు. తనకు మహబూబాబాద్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరితో ఆత్మీయ సంబంధం ఉందని, ప్రతి ఒక్కరూ వారి ఇంటి ఆడబిడ్డగా తనను ఆదరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రేమను ఇలాగే కొనసాగించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరోమారు గెలిపించాలని కోరారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్‌కు మళ్లీ ఓటు వేసి తప్పు చేయొద్దని ప్రజలను కోరారు. తాను పిలవగానే మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వద్దిరాజు కిషన్‌రావు, భరత్‌కుమార్‌రెడ్డి, బానోత్ రవికుమార్, శ్రీనివాస్ రెడ్డి, కేఎస్ఎన్ రెడ్డి, ముత్యం వెంకన్నగౌడ్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌పాషా, మండలాల అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రాజకీయాలొద్దు.. రైతులను ఆదుకోండి

రిజర్వాయర్లలో నీళ్లున్నా విడుదల చేయడం లేదు

- అసమర్థ కాంగ్రెస్ పాలన వల్లే పొలాలు ఎండుతున్నయ్
- కేసీఆర్ హయాంలో రైతులు ఇలాంటి కష్టాలు చూడలె..
- ఎకరానికి రూ.20వేల నష్టపరిహారం ఇవ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్
- దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లో ఎండిన వరి పొలాల పరిశీలన

దేవరుప్పుల/పాలకుర్తి, మార్చి 11: 'రిజర్వాయర్లలో నీళ్లున్నా కాల్వలకు విడుదల చేయని అసమర్థ ప్రభుత్వం ఇది.. అవగాహన లేని మంత్రులు, అధికారులతో సమన్వయ చేసుకోవడం లేదు.. దీని వల్ల యాసంగిలో నీళ్లందక పొలాలు ఎండిపోతున్నయ్.. రైతులు గోస పడుతున్నా కాంగ్రెస్ నేతలకు పట్టడం లేదు.. రైతుల ఉసురు వారికి తాకుతది.. రాజకీయాలొద్దు.. రైతులను ఆదుకోండి' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. కేసీఆర్ హయాంలో రైతులు ఇలాంటి కష్టాలు చూడలేదని, ఇప్పటికైనా దేవాదుల నుంచి నీటిని విడుదల చేయడంతో పాటు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న ఎర్రబెల్లి

సాగునీరందక ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు సోమవారం ఆయన జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్ తండా, ధర్మగడ్డ తండా, సీతారాంపురం, ధర్మాపురం, పాలకుర్తి మండలం మైలారం శివారు టీకే నాయక్ తండా, మల్లంపల్లి బీకే నాయక్ పెద్ద తండాల్లో క్షేత్రస్థాయికి వెళ్లారు. రైతులతో కలిసి వరి పొలాల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకొని ఓదార్చారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే రిజర్వాయర్ల నుంచి నీళ్లు విడుదల చేయాలని ఎర్రబెల్లి కోరారు. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామన్నారు. తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనలో గుంట పొలం ఎండకుండా సాగునీరందించామని గుర్తుచేశారు. దేవాదుల రిజర్వాయర్లలో నీళ్లున్నా విడుదల చేయడం లేదని ఆవేదన చెందారు. బీఆర్ఎస్ పాలనలో వేసవిలో దేవరుప్పుల మండలంలోని చెరువులను నింపేవాళ్లమని, వాగులపై చెక్ డ్యాములు అలుగు పోయడం వల్ల రైతులు ఏనాడూ సాగునీటి సమస్యను ఎదుర్కోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు గోస వచ్చిందని, ఎక్కడికి వెళ్లినా పంటలు ఎండిపోయి మూడు నెలల్లోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం ధరావత్ తండా, ధర్మగడ్డ తండాల్లో బోర్లు వేస్తున్న రైతులతో మాట్లాడారు. పంటలు ఎండుతుంటే పశువులను మేపుతున్నామని గిరిజన రైతు కుటుంబాలు ఎర్రబెల్లితో వివరించి కన్నీళ్లు పెట్టుకోగా నేనున్నాంటూ ఎర్రబెల్లి ధైర్యం చెప్పారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వేలాది ఎకరాలు ఎండుతున్నట్టు రైతులు తెలిపారు.

కరువును ఎదుర్కొనేందుకే కాళేశ్వరం..

ఇలాంటి కరువును ఎదుర్కొనేందుకే బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని మాజీ మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. ఇంత మంచి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రెండు పిల్లర్లు కుంగితే కాళేశ్వరం ప్రాజెక్టే దండుగ అని ఆరోపణలు చేయడం తగదన్నారు. వానలు కురవకుంటే సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తుందన్నారు. దేవరుప్పులలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుందరరాంరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు దయాకర్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, ఏపీసీఎస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నాయకులు మల్లేశ్, మండల ప్రధాన కార్యదర్శి రవి, సుందర్, కృష్ణమూర్తి, డైరెక్టర్లు జోగేశ్వర్, నర్సింహులు, అర్జున్, యాకయ్య, మాజీ సర్పంచ్ గేమానాయక్, సునీత, వెంకన్న పాల్గొన్నారు. పాలకుర్తి మండలంలో ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీకోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, సొసైటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ రాంబాబు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, సొసైటీ వైస్ చైర్మన్ వేణు, ఎంపీటీసీ కళింగరావు, మాజీ ఎంపీపీ వెంకటయ్య, పవన్‌గౌడ్, మాజీ సర్పంచ్ మహేందర్‌నాయక్, జిమ్మిలాల్, సంపత్ శ్రీపాల్, వెంకన్న, వెంకన్న, మంగ్యానాయక్ పాల్గొన్నారు.


పాలకుర్తి మండలం పెద్ద తండాలో రైతులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

నేడు మండల కేంద్రాల్లో ధర్నా : ఎర్రబెల్లి

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతో ప్రజలు విసిగిపోతున్నారని ఎర్రబెల్లి అన్నారు. తొందరపడకండి ఆరు నెలలు ఆగండి మనకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. నీళ్లు లేక ఎండిపోతున్న పంటలపై నిరసనగా ఈ నెల 12న మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సుందరయ్యకాలనీ, ఇప్పగూడేనికి వైద్య బృందం

ఇంటింటా రక్త నమూనాల సేకరణ

గ్రామాల్లో పారిశుధ్య పనులు.. 'నమస్తే' కథనానికి స్పందన

వాజేడు, మార్చి11 : మండలంలోని గుమ్మడిదొడ్డి జీపీ పరిధి ఇప్పగూడెం, సుందరయ్యకాలనీ గ్రామాలకు వైద్య బృందం వచ్చింది. 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'విస్తరిస్తున్న జ్వరాలు' కథనానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. సోమవారం హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి నేతృత్వంలో హెల్త్ అసిస్టెంట్లు శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు ఆశ వర్కర్లతో కలిసి ఆయా గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. జ్వరాలు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త నమూనాలు సేకరించి మందులను అందజేశారు. జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. మురుగు కాలువల్లో యాంటీ లార్వాను పిచికారీ చేయించారు. సుందరయ్యకాలనీ గ్రామంలో మురుగు కాలువలో పేరుకపోయిన చెత్తను కార్యదర్శి రేఖశ్రీ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. అంతేకాకుండా ఇండ్లు, మురుగు కాలువల చుట్టూ బ్లీచింగ్, పారిశుధ్య పనులు చేపట్టారు. బావుల్లో క్లోరినేషన్ పనులు చేశారు.

ఇప్పగూడెం గ్రామంలో పశ్రిక సూజాతకు పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

భగీరథ ప్రయత్నంలో బతుకు చితికి..

వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా ఒకరి మృతి

క్రేన్ డబ్బాలో దిగుతుండగా తీగ తెగడంతో ప్రమాదం

బావిలో పడి అక్కడికక్కడే మృత్యువాత

భీమదేవరపల్లి, మార్చి 11 : వ్యవసాయ బావిలో పూడిక తీసేందుకు క్రేన్ డబ్బాలో దిగుతుండగా గేర్ వైరు తెగి ఓ వ్యక్తి బావిలో పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ముల్కనూరులో సోమవారం జరిగింది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి కుమారస్వామి (53) ఐదేళ్లుగా అతడి అత్తవాళ్ల గ్రామం ముల్కనూరులో క్రేన్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామానికి చెందిన మారుపాక రాజమొగిలి వ్యవసాయ బావిలో నీళ్లు అడుగంటాయి. దీంతో పూడికతీత తీయాలని రెడ్డి కుమారస్వామిని కోరాడు. ఎనిమిది రోజులుగా కుమారస్వామి కూలీల సహాయంతో పూడికతీత పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో కూలీలు కూన యాదగిరి, అలుగు వెంకటేశ్, మారుపాక రమేశ్, అలుగు మణెమ్మ పూడికతీత పనులకు వెళ్లారు. మొదట వెంకటేశ్, రమేశ్ క్రేన్ సహాయంతో డబ్బా ద్వారా బావిలోకి దిగారు. అనంతరం క్రేన్ నడుపుతున్న రెడ్డి కుమారస్వామి అతడి భార్య రమాదేవికి చెప్పి బావిలోకి దిగేందుకు క్రేన్ డబ్బా ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు క్రేన్ గేరు వైరు ఊడిపోయింది. దీంతో డబ్బాతో సహా కుమారస్వామి బావిలో పడ్డాడు. బండపై పడడంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కళ్లముందే కట్టుకున్న భర్త విగతజీవిగా పడి ఉండడంతో రమాదేవి రోదనలు మిన్నంటాయి. కుమారస్వామికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నంద్రు సాయిబాబు తెలిపారు.

మృతదేహంపై విలపిస్తున్న కుమారస్వామి కుటుంబసభ్యులు

గేరు వైరు ఊడిపోయిన క్రేన్

కాల్వ ఇలా.. చివరికి పారేదెలా?

సాగునీరందక ఎండుతున్న పంటలు

నీళ్లు విడుదల చేయాలని డిమాండ్

చెన్నారావుపేట, మార్చి11 : సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నారావుపేట మండల వ్యాప్తంగా అనేక మంది రైతులు కాల్వలు, చెరువులు, బావులను నమ్ముకొని యాసంగిలో వరి, మక్కజొన్న సాగు చేశారు. అయితే వారానికోసారి కాల్వలో నీళ్లు వస్తుండడంతో చివరి ఆయకట్టు పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. మరికొన్ని చోట్ల చెరువులు, బావుల్లో నీరు అడుగంటడంతో రైతులు వేల రూపాయలు ఖర్చు పెట్టి పూడికతీత పనులు చేపడుతున్నారు. పదేళ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదని, అధికారులు స్పందించి పంటలు చేతికందే వరకైనా కాల్వలో నీరు వదలాలని డిమాండ్ చేస్తున్నారు.

నీరు లేక వెలవెలబోతున్న కాల్వ

తాగునీటి కోసం నిరసన తెలుపుతున్న బీరన్నకాలనీ వాసులు

మా కాలనీకి నీళ్లివ్వండి..

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కరీమాబాద్, మార్చి 11: తమ కాలనీకి తాగునీరు అందించాలని 42వ డివిజన్‌లోని బీరన్నకాలనీవాసులు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం వేసిన మిషన్ భగీరథ పైపులైన్ తమ కాలనీకి సమీపంలో ఉన్నా అధికారులు తాగునీరందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ చూపి తమ కాలనీలో పైపులైన్లు వేసి తాగునీరందించాలని కోరారు.